సాక్షి రంగారెడ్డి

గురువారం । 3 । ఏప్రిల్ । 2025



వామ్మో పహాడీషరీఫ్!

నగర శివారు అయిన పహాడీషరీఫ్ పరిసరాలను నేరస్తులు తమకు అనువైన ప్రాంతంగా ఎంచుకుంటున్నారు. 8లో ▸



రేషన్ బియ్యంపై ఫిర్యాదు

రేషన్ బియ్యంలో డీలర్ అవకతవకలకు పాల్పడుతున్నాడని కందుకూరులోని జైత్వారంవాసులు ఆందోళన చేశారు. 8లో ▸



మంత్రి పదవి ఇవ్వాలి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని పారా మెడికల్ వైద్యుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. 8లో ▸

న్యూస్‌రీల్

నేడు కడ్తాల్ మండలంలో హరీశ్‌రావు పర్యటన



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

కడ్తాల్: మండలంలో గురువారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పర్యటించనున్నారని బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం బోయిగుట్ట, ముద్వీన్ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హరీశ్‌రావు ఉదయం 10 గంటలకు మండలంలోని చరికొండ పంచాయతీ పరిధిలోని బోయిన్‌గుట్ట తండాలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్, సంత్ సేవాలాల్ విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ముద్వీన్ గ్రామంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి నిర్మించిన ఇంటిని ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం బోయిన్‌గుట్ట తండాలో బహిరంగ సభలో మాట్లాడతారని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, నాయకులు వీరయ్య, రామకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్- 2025 పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను ఈనెల 19 వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు రుసుము ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఇతరులకు రూ.500 ఉంటుందన్నారు. గడువు దాటిన తర్వాత ఈనెల 21 వరకు రూ.100, ఈనెల 23 వరకు అయితే రూ.300 అపరాద రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని, పరీక్ష రాసిన 12 రోజుల తర్వాత ఫలితాలు వెలువడుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

నేరాలను సహించేది లేదు



మాట్లాడుతున్న డీసీపీ సునీతా రెడ్డి

పహాడీషరీఫ్: రౌడీషీటర్లు సామాన్యులను బెదిరించినా, దాడులకు పాల్పడినా ఉక్కుపాదంతో అణచివేస్తామని మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి హెచ్చరించారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు బుధవారం ఆమె ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డితో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలోని ప్రతి రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. వారి ప్రవర్తన, పని చేసే చోట వ్యవహరిస్తున్న తీరును పరిశీలిస్తున్నామన్నారు. బస్తీల్లో ఇరుగు పొరుగు వారిపై జులుం ప్రదర్శించడం, దాడులు, ఇతరత్రా నేరాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ప్రవర్తనలో మార్పు లేని వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా పండుగల సమయంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే కమ్యూనల్ షీట్లు కూడా తెరుస్తామన్నారు. కార్యక్రమంలో బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు చేసుకోండి

షాద్‌నగర్: జిల్లా పరిధిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి జిల్లా రీజినల్ గిరిజన గురుకులాల కోఆర్డినేటర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షాద్‌నగర్ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనం ఆవరణలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మెస్ మేనేజర్, ల్యాబ్ అసిస్టెంట్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, మైక్రో బయాలజీ) పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. మెస్ మేనేజర్‌కు ఎంఎస్సీ (హోం సైన్స్, డైటీషియన్, ఫుడ్‌సైన్స్, న్యూట్రీషియన్) అర్హత కలిగి ఉండాలని, ల్యాబ్ అసిస్టెంట్‌కు బీఎస్సీ (ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్) అర్హత ఉండాలన్నారు. జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 9లోపు రాజేంద్రనగర్‌లోని రీజినల్ గిరిజన గురుకులాల కోఆర్డినేటర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

విత్తన పండుగకు సిద్ధం



విత్తన పండుగకు సిద్ధమైన ఎర్త్‌సెంటర్ వ్యూ

ముస్తాబవుతున్న అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్

- రేపటి నుంచి మూడురోజుల పాటు వేడుకలు
- దేశంలోని వలు రాష్ట్రాల దేశీ విత్తనాల ప్రదర్శన
- తరలిరానున్న వ్యవసాయ నిపుణులు, పాలసీ మేకర్స్
- ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

కడ్తాల్: తెలంగాణ తొలి విత్తన పండుగకు మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్ సెంటర్ ముస్తాబవుతోంది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో విత్తన పండుగ నిర్వహించనున్నారు. ఆరోగ్యానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని.. దేశీ విత్తనాల ప్రదర్శన, ఉచిత పంపిణీ, విక్రయాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయ విత్తనాల వైభవాన్ని తెలియజేసేందుకు, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు ఈ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, పాలసీ మేకర్స్‌ని ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు. వ్యవసాయ, పర్యావరణ నిపుణులతో పాటు, పాలసీ మేకర్స్ పెద్ద ఎత్తున తరలిరానున్నారని వారు వివరించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, కలెక్టర్ నారాయణ రెడ్డి, పాలసీ నిపుణులు దొంతి నర్సింహా రెడ్డి, పర్యావరణవేత్తలు పురుషోత్తం రెడ్డి, సాయి ప్రభాకర్ రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

విత్తన పండుగ లక్ష్యాలు

- విత్తనాలను భద్రపరచడం, ఉపయోగించడం, పంచుకోవడం, ఒక ఉద్యమంగా చేయడం.
- విత్తనాలను గుర్తించడంలో, దాచుకోవడంలో, పెంపొందించుకోవడంలో స్థానికుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.
- మన వృక్ష జాతులు, జంతు జాతులను కాపాడుకోవడంతో పాటు, వాటికి సంబంధించిన సహజ సాంస్కృతిక పద్ధతులను సంప్రదాయాలను గౌరవించుకోవడం.
- రైతులు, ఆదివాసులు, అటవీ ప్రజలు, కొండ ప్రాంత ప్రజలు, మత్స్యకారులు తదితర జీవనోపాధులతోపాటు భవిష్యత్ తరాల విత్తన హక్కులను కాపాడుకోవడం.
- స్థానిక ప్రజల అవసరాలు, ప్రత్యేకంగా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రకృతి వ్యవసాయానికి, జీవ వైవిధ్య, అటవీ సంరక్షణకు తోడుగా ఉండటం.
- సహజ సంపదను కాపాడుతూ, పరిపుష్టికి ప్రయత్నాలు చేస్తూ, స్థిరమైన జీవనోపాధులు, సంప్రదాయ జ్ఞానాన్ని కొనసాగించడం.
- స్థానిక, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రైతు ప్రకృతి అనుకూల విత్తన విధానాల కోసం కలిసికట్టుగా పనిచేయడం.

సదస్సు ప్రత్యేకత

- వివిధ పంటలకు సంబంధించి రకరకాల సంప్రదాయ విత్తన జాతుల ప్రదర్శన.
- రైతులు, విత్తన సంరక్షకులు, ఆదివాసీలు, సామాజిక కార్యకర్తలతో నేరుగా మాట్లాడే అవకాశం.
- పోస్టర్లతో, డాక్యుమెంట్లతో, ఫొటోగ్రాఫ్స్‌తో ప్రదర్శన.
- ప్రముఖ వ్యవసాయ రంగ, పర్యావరణరంగ నిపుణుల ప్రసంగాలు, ప్రదర్శనలు, వర్క్‌షాపులు, సెమినార్లు.
- పుస్తకాలు, ప్రకృతి అనుకూల ఉత్పత్తులు, సంప్రదాయ కళలు, హస్త కళా ప్రదర్శన, విక్రయాలు.
- విత్తనాలు ఇచ్చి పుచ్చుకోవడం, పంచుకోవడం.
- స్వదేశీ, అటవీ, సేంద్రియ రసాయన రహిత ఆహారం అందుబాటులో ఉంచడం.
- సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతం, పాటలు, గిరిజన నృత్యాలు.

50 స్టాల్స్ ఏర్పాటు

4, 5, 6 తేదీల్లో ఎర్త్ సెంటర్‌లో నిర్వహించనున్న విత్తన పండుగకు సంబంధించి కేరళ, తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విత్తన నిపుణులు హాజరు కానున్నారు. విత్తనం, విత్తన జ్ఞానం, అనుభవాల ప్రదర్శనలకు ఎర్త్ సెంటర్‌లో 50 స్టాల్స్ ఏర్పాటు చేశారు.



స్టాల్స్ కోసం ఏర్పాట్లు

ఫార్మాసిటీ భూముల పరిశీలన



భూములను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: మండలంలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీకి సేకరించిన అసైన్డ్, పట్టా భూములను బుధవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పరిశీలించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా శాంతియుతంగా నచ్చజెప్పి సేకరించిన భూములను సర్వే చేసి, ఫెన్సింగ్ వేసేలా చర్యలు తీసుకోవాలని గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజుకు సూచించారు. మరోవైపు నేటి నుంచి మొదలయ్యే సర్వే 40 నుంచి 60 రోజుల్లోపు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యాచారం తహసీల్దార్ అయ్యప్ప ఆధ్వర్యంలో ఇద్దరు ఆర్ఐలు, ఇద్దరు సర్వేయర్లు, మరో ఆరుగురు రెవెన్యూ, టీజీఐఐసీ సిబ్బంది సర్వేలో పాల్గొననున్నారు. వీరే కాక ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డితో పాటు ఏసీపీ కేపీవీ రాజు ఇతర ఉన్నతాధికారుల బృందం సైతం సర్వే, ఫెన్సింగ్ వేసే విషయంలో భాగస్వాములు కానున్నారు.

పౌరుషానికి ప్రతీక సర్వాయి పాపన్నగౌడ్



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

మొయినాబాద్: తెలంగాణ మట్టి పౌరుషానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేణట్ల మల్లేశ్‌గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను బుధవారం మున్సిపల్ కేంద్రంలో నిర్వహించారు. సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య కుటుంబంలో జన్మించి భూనిసత్వాన్ని ధిక్కరించి దళిత, బహుజనులను రాజ్యాధికారం వైపు నడిపించి గోల్కొండ కోటను ఏలిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కొనియాడారు. నేటి తరం ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, నాయకులు మహిపాల్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, అశోక్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, కొకంట్ల మల్లేష్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, బందయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్ మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న గిరిజన సంఘం ప్రతినిధులు

ట్రైకార్ బకాయి రుణాలు విడుదల చేయాలి

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ట్రైకార్ బకాయి రుణాలు రూ.219 కోట్లు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘాల జేఏసీ, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివ నాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ముడావత్ గోపీనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సరూర్‌నగర్ మండల కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ ధర్మానాయక్ మాట్లాడుతూ.. గిరిజనులకు సంబంధించిన ట్రైకార్ 2019-2020, 2021లో 30వేల మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం గుర్తించి రూ.219 కోట్లు కేటాయించిందని, క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఈ నిధులను నేటికీ విడుదల చేయకుండా గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వెంటనే బకాయి రుణాలు విడుదల చేయాలని కోరారు. లబ్ధిదారులు ఇతర రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లో రిజెక్ట్ అవుతోందని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ట్రైకార్ నిధులు విడుదల చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. లేదంటే ఈ నెల 7న గిరిజనులతో మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ భవన్‌ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాణాపురం రఘు, కార్యనిర్వాహక అధ్యక్షులు కండాల వెంకటేశ్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంటి స్థలాలకు విముక్తి కల్పించాలి

ఇబ్రహీంపట్నం: రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం కబ్జాలో ఉన్న పేదల ఇంటి స్థలాలకు రేవంత్ సర్కార్ విముక్తి కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. ఇంటి స్థలాల బాధితులతో బుధవారం మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు 60 గజాల చొప్పున 600 మందికి పంపిణీ చేశారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో లక్ష నాగళ్లతో రామోజీ ఫిలిం సిటీని దున్ని పేద ప్రజలకు భూములను పంచుతానన్న కేసీఆర్... పదేళ్ల కాలంలో కనీసం పేదల ఇంటి స్థలాలను విడిపించలేకపోయారని విమర్శించారు. ప్రజా సర్కార్ అని చెప్పుకొంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు ఇంటి స్థలాలు దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రవీంద్రచారి మాట్లాడుతూ.. ఫిలింసిటీ కబ్జాలోని ఇంటి స్థలాలను లబ్ధిదారులకు ఇవ్వకుంటే వేలాది మంది పేదలతో గుడిసెలు వేయించి మరో భూపోరాటానికి దిగుతామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కావాలి నర్సింహ, ముత్యాల యాదిరెడ్డి, పాచమోని నీలమ్మ, మొలుగు నర్సింహ, శివరాల లక్ష్మయ్య, నర్సింహ, శ్రీహరి, అంజయ్య, సీతయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

పరిష్కారం కాక.. తిరగలేక!

- ధరణిలో 15,936 దరఖాస్తులు పెండింగ్
- నిషేధిత జాబితా, తప్పుల సవరణ ఎక్కువ
- ఏళ్లుగా బాధితుల ఎదురుచూపులు
- ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ
- పట్టించుకోని జిల్లా రెవెన్యూ యంత్రాంగం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఇబ్రహీంపట్నం మండలం మంగళ్‌పల్లికి చెందిన పాతూరి మహేశ్వరికి రాందాస్‌పల్లి రెవెన్యూ సర్వే నంబర్ 41/25లో మూడున్నర ఎకరాల పట్టా భూమి ఉంది. కాసుల పహాణీ, పైసలపట్టి, ఇతర రెవెన్యూ రికార్డుల్లోనూ పట్టా భూమిగా రికార్డయింది. ఈ సర్వే నంబర్‌లో వెయ్యి ఎకరాలకుపైగా భూమి ఉంది. ఓ అజ్ఞాత వ్యక్తి వేసిన కేసుతో అధికారులు (ఇదే సర్వే నంబర్‌లో ఓ రియల్టర్ వేసిన వెంచర్‌ను మినహాయించి చిన్న, సన్నకారు రైతుల భూములను నిషేధిత జాబితాలో చేర్చారు) సర్వే నంబర్ మొత్తం బ్లాక్ చేశారు. రైతులందరి భూములను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. బాధితురాలు మహేశ్వరి నిషేధిత జాబితా నుంచి తమ భూమికి విముక్తి కల్పించాలని కోరుతూ 2023 ఆగస్టు 10న టీఎం 15 మాడ్యుల్ కింద దరఖాస్తు చేసుకున్నారు. రెండేళ్లయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇచ్చిన దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు బాధితురాలు తహసీల్దార్, ఆర్డీఓను సంప్రదించినా ఫలితం లేకపోయింది. దీంతో 2025 ఫిబ్రవరి 22న మళ్లీ అదే మాడ్యుల్ కింద దరఖాస్తు చేసుకుంది. అయినా సంబంధిత అధికారుల నుంచి కనీస స్పందన లేదు. ఇంటి ఖర్చులు, ఇతర అవసరాల కోసం భూమిని అమ్ముకుందామంటే స్లాట్ బుక్‌కాని పరిస్థితి'. ఇదీ కేవలం మహేశ్వరికి ఎదురైన అనుభవం మాత్రమే కాదు.. జిల్లాలో 15,936 మంది భూ బాధితులు ఇలాంటి అనుభవాలనే ఎదుర్కొంటున్నారు. ఉద్దేశ పూర్వకంగా పట్టా భూములను అసైన్డ్ భూములుగా రికార్డు చేయడం.. ఒకరిద్దరు భూ యజమానుల మధ్య నెలకొన్న వివాదాన్ని మొత్తం సర్వే నంబర్‌కు ఆపాదించడం.. సరిహద్దు భూములను కూడా బ్లాక్ లిస్ట్‌లో చేర్చడం.. ఆ తర్వాత దళారుల ప్రమేయంతో వాటిని క్లియర్ చేయడం రెవెన్యూ యంత్రాంగానికి పరిపాటిగా మారింది.

అదనపు కలెక్టర్ వద్దే అత్యధికంగా పెండింగ్

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో 12 లక్షల ఎకరాలకుపైగా ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డ్, భూదాన్, వక్ఫ్, సీలింగ్, లావణి పట్టా భూములు ఉన్నాయి. పహాణీల ఆధారంగా ఆయా భూముల వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేశారు. పొజిషన్‌లో ఉన్న భూమికి, రికార్డుల్లో నమోదైన భూములకు పొంతనే లేదు. భూమికి మించి రికార్డులు ఉండటం, రైతుల పేరున పట్టాదారు పాసు పుస్తకాలు ఉండటం అధికారులను ఇక్కట్లకు గురి చేసింది. కొంతమంది అధికారులు రియల్టర్లు, డెవెలపర్లతో కుమ్మక్కై పట్టా భూములను అసైన్డ్ భూములుగా, సీలింగ్ భూములను పట్టా భూములుగా పోర్టల్‌లో నమోదు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. భూములు నిషేధిత జాబితాలో ఉన్న విషయం తెలిసి.. జాబితా నుంచి వాటిని తొలగించాల్సిందిగా కోరుతూ భూ యజమానుల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందాయి. ఇలా ఇప్పటి వరకు ధరణి పోర్టల్‌కు రెండు లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. వీటిలో మెజార్టీ దరఖాస్తులను కలెక్టర్ క్లియర్ చేశారు. కొన్ని వివాదాలు అలాగే అధికారుల వద్ద పెండింగ్‌లో ఉండిపోయాయి. అప్పటి వరకు కేవలం కలెక్టర్ లాగిన్‌లోనే పరిష్కారమయ్యే ధరణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తహసీల్దార్, ఆర్డీఓ, అదనపు కలెక్టర్‌లకు లాగిన్ సౌలభ్యం కల్పించి, వారి పరిధిలో పలు అంశాలకు పరిష్కారమార్గం చూపేలా చర్యలు చేపట్టింది. ఇదే సమయంలో కాసులకు కక్కుర్తి పడి.. గత అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భూపాల్‌రెడ్డి ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆ బాధ్యతలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ నిర్వహిస్తున్నారు. అయితే ఇటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బాధ్యతలు, అటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో పని భారం కారణంగా మెజార్టీ దరఖాస్తులు అదనపు కలెక్టర్ వద్దే పెండింగ్‌లో ఉండిపోయాయి. బాధితులు ఆయా రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ప్రతి సోమవారం కలెక్టరేట్, ఆర్డీఓ, తహసిల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

జలమండలికి 'వరల్డ్ వాటర్' అవార్డు



జలమండలి ఎండీకి అవార్డు అందజేత

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిని వరల్డ్ వాటర్ అవార్డు వరించింది. వాటర్ డైజెస్ట్ అనే ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 2024-2025 సంవత్సరానికి గాను 19వ వాటర్ డైజెస్ట్ వరల్డ్ వాటర్ అవార్డులకు ప్రభుత్వ కేటగిరీలో జలమండలి ఎస్టీపీని ఎంపిక చేసింది. రెండు రోజుల క్రితం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ అవార్డు అందుకున్నారు. బుధవారం ప్రధాన కార్యాలయంలో ఆయన ఈడీ చేతుల మీదుగా ఎండీ అశోక్ రెడ్డికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో అందరికీ తాగునీరు అందించడంతో పాటు.. మురుగును శుద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. నాగోల్ ఎస్టీపీ పర్యావరణ అనుకూలత, సమర్థంగా మురుగు నీటి శుద్ధి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విశేష ప్రాముఖ్యతను చూపినందుకు నాగోలు ఎస్టీపీ ఈ అవార్డుకు ఎంపికైందని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఎస్టీపీ సీజీఎంలు పద్మజ, సుజాత, జీఎం కుమార్, డీజీఎం నిరుపమ పాల్గొన్నారు.

పూలే ఉత్సవాలకు ఆహ్వానం

గోల్కొండ: సామాజిక సంస్కర్త, బీసీ బడుగు వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని కార్వాన్ బీసీ ఐక్యవేదిక నాయకులు పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనను కలిసి గుడిమల్కాపూర్‌లో జరగనున్న జ్యోతిరావు పూలే 198వ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. హోదా, ప్రతిష్టను ఆశించకుండా జ్యోతిరావు పూలే చేసిన కృషి ప్రతి ఒక్కరికి తెలుసునని ఈటల రాజేందర్ అన్నారు. ఆయనను కలిసిన వారిలో బీసీ ఐక్యవేదిక నాయకులు కె.అనిల్‌కుమార్, పంబి శ్రీనివాస్, నర్సింగ్, శ్యామ్‌సుందర్, వెంకటేష్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర సహ కార్యదర్శి ప్రభు పూజారి, కట్ట నర్సింగ్ రావు తదితరులు ఉన్నారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that my client entered into an agreement of sale with Sri Dwaram Vishnu Vardhan Reddy, son of Sri Dwaram Sudhakar for purchase of ALL THAT the Plot No.363, admeasuring 200 sq.yds., after releasing from HMDA Mortgage in forming part of Sy.Nos.158/P, 159/P and 163/P in "GREEN CITY DUKES COUNTY", Project situated at KONDAKAL Village and Grampanchayath, SHANKARPALLY Mandal, RANGA REDDY District, Telangana State, registration at the office of the Sub-Registrar of Shankarpally, Ranga Reddy District Telangana State and covered by residential open plots approved by Hyderabad Metropolitan Development Authority through Letter No. 038552/LT/SKP/FLT/U6/HMDA/28082020 and Final Layout Permit No. 000178/LO/Plg/HMDA/2008, dt: 03-02-2021 and bounded by : NORTH : Plot No.364; SOUTH : Plot No.362; EAST : Plot No.376; WEST : 40 feet wide Road.

Any person/s having any claim, interest, share or charge over the said property or objection in respect of the said transaction shall lodge his objection with the undersigned together with the authenticated copies **within 7 days.** Otherwise my client will proceed with the sale transaction and the objection raised thereafter shall be deemed to have been waived and shall not be entertained.

Sd/- **K. RAMALINGA REDDY**
Advocate
H.No.2-2-1105/39, Tilaknagar Colony,
Hyderabad-500044. Mobile: 9849546650

బైక్‌ను ఢీకొన్న కారు

- అక్కడికక్కడే వ్యక్తి దుర్మరణం
- మృతిపై అనుమానాలు వ్యక్తం చేసిన కుటుంబీకులు
- కల్వకోల్ గ్రామంలో విషాదం

మహేశ్వరం: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన మండల పరిధిలోని కల్వకోల్ గేటు సమీపంలో మన్సాన్‌పల్లి చౌరస్తా–దుబ్బచర్ల మధ్యలో చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కల్వకోల్ గ్రామానికి చెందిన గూడెపు శంకరయ్య(52) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఆయన మహేశ్వరానికి వ్యక్తిగత పని మీద బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో అదే ఊరికి చెందిన కొండని ప్రశాంత్ కారులో వస్తూ కల్వకోల్ చౌరస్తా వద్ద ముందున్న బైక్‌ను వెనుకాల నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శంకరయ్య తలకు బలంగా దెబ్బ తగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందారు.


శంకరయ్య (ఫైల్)

విషయం తెలుసుకున్న గ్రామస్తులు, రోడ్డుపై వెళ్లే వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

దాయాదులపై ఫిర్యాదు

ఇదిలా ఉండగా తన భర్త శంకరయ్య మృతి పట్ల అనుమానాలున్నాయని భార్య కమలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్నేళ్ల నుంచి తమకున్న భూమిపై దాయాదులతో వివాదం ఉందన్నారు. ఇటీవల కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని తన భర్త చెప్పాడన్నారు. భూమి దక్కదనే ఆలోచనతో దాయాదులు కారు డ్రైవర్‌కు సుపారి ఇచ్చి రోడ్డు ప్రమాదం చేయించి హత్య చేయించారని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు న్నారు. గ్రామంలో శంకరయ్య మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

మల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

- ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టిన మద్దతుదారులు

ఇబ్రహీంపట్నం: స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర పారా మెడికల్ వైద్యుల ఐక్య వేదిక అధ్యక్షుడు ఉక్కుల అశోక్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో బుధవారం ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన మల్‌రెడ్డికి మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి దీక్షకు మద్దతు తెలిపారు. అశోక్‌తోపాటు పలువురు ఆర్ఎంపీలు శిబిరంలో కూర్చున్నారు.


దీక్ష శిబిరంలో కూర్చున్న నాయకులు

పోలీసులపై దాడి చేసిన యువకుల అరెస్టు

రాజేంద్రనగర్: విధి నిర్వహణలో ఉన్న పోలీసు కానిస్టేబుళ్లపై దాడికి పాల్పడిన ఐదుగురిని రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ క్యాస్ట్రో సమాచారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబియన్స్ ఫోర్టు చౌరస్తా వద్ద కొందరు యువకులు రోడ్డుపై గొడవ పడుతున్నారని డయల్ 100కు సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. నైట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ చంద్రశేఖర్‌తో పాటు మరో కానిస్టేబుల్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గొడవ పడుతున్న వారిని సముదాయించేందుకు ప్రయత్నించగా వినిపించుకోకుండా పోలీసులపైనే దాడి చేశారు. దీంతో స్టేషన్‌కు సమాచారం అందించడంతో హుటాహుటిన చేరుకున్న పోలీసులు దాడికి పాల్పడిన రాజేంద్రనగర్, నౌ నంబర్, హ్యాప్పీ హోమ్స్ ప్రాంతాలకు చెందిన ఖాజా అద్నాన్(24), మహ్మద్ ఆర్బాజ్‌ఖాన్(19), సయ్యద్ అబ్దుల్(21), ఖాజా ఫయాజుద్దీన్(22), షేక్ హిమాయత్ అలీ(22)లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

వామ్మో పహాడీషరీఫ్!

- నేరస్తులకు అడ్డాగా మారిన వైనం
- నిర్మానుష్య ప్రాంతాల్లో తరచూ ఘటనలు
- నిఘా పెంచాలని స్థానికుల విన్నపం

పహాడీషరీఫ్: నగర శివారుగా ఉన్న పహాడీషరీఫ్ పరిసరాలను నేరస్తులు తమకు అనువైన ప్రాంతంగా ఎంచుకుంటున్నారు. ఏదైనా నేరం చేయాలన్నా.. చేసిన నేరానికి సంబంధించిన ఆనవాళ్లు లేకుండా చేయాలన్నా ఈ ప్రాంతమే సరైనదిగా భావిస్తున్నారు. ఇంకా పూర్తిస్థాయిలో నిర్మాణాలు రూపుదాల్చుకోకుండా నిర్మానుష్య ప్రాంతం అధికంగా ఉండడంతో ఏ తప్పైనా మూడో కంటికి కనబడకుండా చేయొచ్చన్న ఆలోచనకొస్తున్నారు. మూడు రోజుల క్రితం నిందితుడు అస్లాం జర్మనీ యువతిని ఈ ఆలోచనతోనే పహాడీషరీఫ్ ప్రాంతంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకొచ్చి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఇదే స్టేషన్ పరిధిలో 2014లో చోటు చేసుకున్న స్నేక్‌గ్యాంగ్ ఘటన కూడా అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. వెరసి ఇలాంటి ఘటనలతో ఈ ప్రాంతం నేరమయమైనదిగా అపకీర్తిని మూటగట్టుకోవాల్సి వస్తుంది.

అసాంఘిక కార్యకలాపాలు

నగరంలో విద్యనభ్యసిస్తున్న కొంత మంది కళాశాలల విద్యార్థులు తమ నీచ కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకుంటున్నారు. ముఖ్యంగా మామిడిపల్లి, జల్‌పల్లి మధ్యలో రెండు దశాబ్దాల క్రితం చేసిన లేఅవుట్లు నిర్మాణాలు లేకుండా నిర్మానుష్యంగా ఉంటున్నాయి. భారీ చెట్లతో వనాన్ని తలపించే జల్‌పల్లి గ్రీన్ హోం వెంచర్లలో నిత్యం జంటలు వచ్చి ఏకాంతంగా గడుపుతున్నారు. ఇలాంటి వారితో క్రైమ్ రేట్ పెరిగే అవకాశం ఉంది. 2014లో ఇదే తరహాలో ఫాంహౌజ్‌లో గడిపేందుకు వచ్చిన జంటను గమనించిన స్థానికంగా క్రికెట్ ఆడుతున్న కొందరు యువకులు వారిని పాముతో బెదిరించి యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన(స్నేక్ గ్యాంగ్) తెలిసిందే. గతంలో పాతబస్తీ నుంచి


జల్‌పల్లి చెరువు వద్ద నిందితుల కోసం గాలిస్తున్న జాగిలం (ఫైల్)

సరదా చేసేందుకు తుక్కుగూడ వైపు వచ్చిన ఓ ప్రేమ జంట గొడవపడి.. యువకుడు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గరిగుట్ట పరిసరాలలో కూడా ఇలాంటి ప్రభావమే ఉంది. పోలీసు అధికారులు ఇలాంటి ప్రాంతాలపై నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.

ఎక్కడో హత్య చేసి.. ఇక్కడ పడేసి

తమ శత్రువులను ఎక్కడో హత్య చేస్తున్న నిందితులు అర్ధరాత్రి వేళ మృతదేహాలను తీసుకొచ్చి స్టేషన్ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతాలలో పడేస్తున్నారు. దీంతో ఉదయాన్నే చూస్తున్న పోలీసులు కేసు ఛేదించేందుకు తలలు పట్టుకోవాల్సి వస్తుంది. జల్‌పల్లి పెద్ద చెరువు, తుక్కుగూడ హైవే పరిసరాలలోనే మృతదేహాలను పడేసేందుకు అనువైన


పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్

స్థలంగా ఎంచుకుంటున్నారు. కొన్నిసార్లు ఇతర ప్రాంతాలలో హత్య చేసి ఇక్కడ పడేస్తుండగా.. మరికొన్ని సార్లు ఇక్కడ మద్యం పార్టీలు చేసుకుంటూ పథకంలో భాగంగా హత మారుస్తున్నారు.

అధిక శాతం ఉత్తర భారతీయులే

ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన ప్రజలు జీవనోపాధి నిమిత్తం నగరానికి అధిక సంఖ్యలో వస్తుంటారు. వారంతా పహాడీషరీఫ్ ఠాణా పరిసరాల్లో ఎక్కువగా నివాసం ఉంటున్నారు. ఇలాంటి వారు హత్యకు గురవుతుండడం.. ఒక్కోసారి వీరే హత్యలు చేసి తమ స్వరాష్ట్రాలకు పారిపోతుండడంతో కేసుల దర్యాప్తు ముందుకు సాగని పరిస్థితి నెలకొంటుంది. వీరితో పాటు పాత బస్తీ నుంచి వచ్చి కూడా ఇక్కడ హత్యలు చేసిన ఘటనలు ఎన్నో వెలుగుచూశాయి. చాలా వరకు ఎక్కడో హత్య చేసి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిసరాలలో పడేసిన మృతదేహాలలో పోలీసులు కేసులను ఛేదించినప్పటికీ.. ఇంకొన్ని మాత్రం ఎటూ తేలని పరిస్థితి నెలకొంది.

మచ్చుకు కొన్ని ఘటనలు

- 2023 ఏప్రిల్ 12న బడంగ్‌పేట్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే నిందితుడు సైదమ్మ అనే మహిళను హత్య చేసి రాత్రిపూట కారులో తీసుకొచ్చి తుక్కుగూడ హైవేపై పడేసి పరారయ్యాడు.
- 2023 మే 25న యూపీకి చెందిన పూరన్‌సింగ్(30)ను అతని ప్రియురాలు, మరికొందరు కలిసి దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని డ్రమ్ములో కుక్కి, సూరం చెరువులో పడేశారు.
- 2021 ఆగస్టు 3న జల్‌పల్లి కార్గో రోడ్డు పక్కన గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. రెండేళ్లు కావొస్తున్నా మృతుడు ఎవరో.. హత్య చేసిందెవరో తెలియరాలేదు.
- మామిడిపల్లిలోని ఎస్ఎస్‌పీడీఎల్ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఉన్న గెస్ట్ హౌజ్‌లో 2016 జూన్ 25న ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రమాకాంత్ పాండే(40) దారుణ హత్యకు గురయ్యాడు. వెంచర్‌లోకి తాను తీసుకొచ్చిన ఓ యువతి, యువకుడే ఈ దారుణానికి ఒడిగట్టాడని పోలీసులు భావించినప్పటికీ వారు ఇంకా దొరకలేదు.
- 2016 ఆగస్టు 13న పహాడీషరీఫ్–మామిడిపల్లి రహదారి పక్కన ఉన్న ఓ ప్రైవేట్ సంస్థ ఆవరణలో 25 ఏళ్ల గుర్తు తెలియని యువకుడిపై పెట్రోల్ పోసి తగులబెట్టి హత్య చేసిన ఘటన వెలుగుచూసింది.

రేషన్ బియ్యం అవకతవకలపై ఫిర్యాదు

కందుకూరు: జాతీయ ప్రజా పంపిణీ ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో డీలర్ అవకతవకలకు పాల్పడుతున్నాడని మండల పరిధిలోని జైత్వారం గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్‌కు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ఇచ్చే బియ్యం కాంటలో మోసం చేస్తూ చాలా తక్కువగా ఇస్తున్నారన్నారు. రేషన్ షాపులో ఓ లబ్ధిదారుడికి 12 కిలోల బియ్యం ఇచ్చారు. అనంతరం అతడు బయట తూకం వేయగా ఒక్క కిలో తగ్గిందని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓర్సు వెంకటేష్, కుమ్మరి నర్సింహ, చల్లా జైపాల్‌రెడ్డి, నవీన్, మహేందర్, పాండు, అజయ్, కార్తీక్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జైత్వారం గ్రామస్తులు

భక్తి మార్గంలో నడవాలి


పూజ కార్యక్రమంలో వక్తలు

చేవెళ్ల: లోక రక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ వక్తలు డాక్టర్ దయానందస్వామి, భాస్కరయోగిలు అన్నారు. మండలంలోని గొల్లగూడలో జరుగుతున్న సచ్చిదానంద సాయన్నార్యుల 51వ వార్షికోత్సవం, శ్రీసాందీప అచల రుషి పరిపూర్ణ గురుమందిర్ కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉదయం నుంచి గురు మందిరంలో వ్యవస్థాపకులు దయానంద నాగుల వెంకటేశం రాజయోగి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దయానందస్వామి, భాస్కరయోగి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడవాలని సూచించారు. లోక కల్యాణం కోసం గురుబోధనల వ్యాప్తిని చేసుకుంటూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అచల రుషి గురు బోధనలు విలువైనవని చెప్పారు. కార్యక్రమంలో వివేకానంద రమణ, వెంకట్‌రెడ్డి, నాగేశ్వరరావు, దయానంద, తిరుపతయ్య, చక్రపాణి, చెన్నయ్య, రాజేంద్రప్రసాద్, అనంత్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

'గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ స్థలంపై ఆందోళన వద్దు'

కాచిగూడ: గచ్చిబౌలిలోని భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ స్థలం విషయంలో సభ్యులు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని సొసైటీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్ అన్నారు. సొసైటీకి సంబంధం లేని, సభ్యులు కాని కొంత మంది చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. బుధవారం కాచిగూడలో భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ కార్యదర్శి జి.మల్లారెడ్డి, కోశాధికారి .శ్రీనివాస్, డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ ఇటీవల సర్వే నెంబర్ 25 కంచ గచ్చిబౌలి లోని 400 ఎకరాల హెచ్‌సీయూ భూమిని ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుందన్నారు. అయితే ఇందులో తమ సొసైటీ స్థలం కూడా ఉందని కొంతమంది ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇందులో వాస్తవం లేదన్నారు. త్వరలో టీఎన్జీవోస్ 80వ ఆవిర్భావ దినోత్సవం ఎల్‌బీ స్టేడియంలో మారం జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి ముజీబ్ హుసేనీల ఆధ్వర్యంలో జరుగనుందని, ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. సొసైటీ స్థలం విషయంలో గందరగోళంపై ఈ సమావేశంలో స్పష్టత ఇస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి


లక్ష్మమ్మ మృతదేహం

శంకర్‌పల్లి: అతివేగం, అజాగ్రత్తగా వెళ్తున్న ఓ బొలెరో వాహనం రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని గణేష్ నగర్‌కి చెందిన లక్ష్మమ్మ(70) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. మంగళవారం రాత్రి సమయంలో రోడ్డు దాటుతుండగా శంకర్‌పల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ బొలెరో వాహనం బలంగా ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి బుధవారం ఉదయం బూర్గుల రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా కాచిగూడ డెమో రైలు ఢీకొని తీవ్ర గాయల పాలయ్యాడు. గమనించిన స్థానికులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉస్మానియాకు తరలించగా పరిస్థితి విషమించి సాయంత్రం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా డాక్టర్ అబ్దుల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో లైన్‌మెన్లు, ఆర్టిజన్లే కీలకం

సందీప్‌కుమార్ సుల్తానియా

సాక్షి, సిటీబ్యూరో: నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాలో ఆర్టిజన్లు, లైన్‌మెన్ల పాత్రే కీలకమని ప్రభుత్వ ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా చెప్పారు. వారి పనితీరు, వ్యవహారశైలిపైనే సంస్థ అభివృద్ధి, ప్రతిష్ట ఆధార పడి ఉందన్నారు. ఈ మేరకు బుధవారం విద్యుత్ సరఫరా, సంస్థాగతంగా ఎదురవుతున్న ఇబ్బందులపై బంజారాహిల్స్ సర్కిల్ ఇంజనీర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. సమస్యలపై తక్షణమే స్పందించే గుణంతో పాటు స్నేహపూర్వకంగా వ్యవహరించడం వల్ల వ్యక్తిగతంగానే కాకుండా సంస్థకు మంచి గుర్తింపు తీసుకురావొచ్చని సూచించారు. వేసవిలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు సంస్థ సిద్ధంగా ఉందన్నారు.

డిమాండ్‌కు తగ్గట్టే సరఫరా

ఈ యాసంగిలో విద్యుత్ డిమాండ్ 17162 మెగావాట్లకు చేరిందని తెలిపారు. గత వేసవితో పోలిస్తే..ఈ సారి గరిష్ట ఉష్ణోగ్రతలు కొంత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగే ఛాన్సు ఉందని, ఆ మేరకు సరఫరా చేసేందుకు సంస్థ సంసిద్ధంగా ఉందని తెలిపారు. గత ఏడాది గ్రేటర్‌లో 4352 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైందని తెలిపారు. ఈసారి ఏకంగా 5000 మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు.

సిటీలో దొడ్డు బియ్యమే!

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిస్తే కానీ, సన్న బియ్యం పంపిణీ జరిగే అవకాశాలు కానరావడం లేదు. జీహెచ్‌ఎంసీ ఎమ్మెల్సీ నామినేషన్ ప్రక్రియ ఈ నెల 9వ తేదీతో ముగియనుంది. విత్‌డ్రాల అనంతరం ఎన్నిక ఏకగ్రీవమైతే 10వ తేదీ తర్వాత కోడ్ ముగిసే అవకాశం ఉంటుంది. ఒక వేళ ఎన్నికల బరిలో అభ్యర్థులు మిగిలి ఎన్నికలు జరిగితే మాత్రం ఈ నెల 29 వరకు కోడ్ అమలులో ఉంటుంది. ఆ తర్వాతనే సన్నబియ్యం జరిగే అవకాశాలున్నాయి. వాస్తవంగా ఏప్రిల్ కోటా నుంచి బియ్యం కేటగిరి మారుతుండటంతో ఎన్నికల కోడ్ నేపథ్యంలో సన్నబియ్యం పంపిణీపై పౌరసరఫరాల శాఖ ఎన్నికల కమిషన్‌ను అనుమతి కోరినా..ఇప్పటి వరకు అనుమతి లభించలేదు. దీంతో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ కొనసాగుతోంది.

దొడ్డు బియ్యంపై అనాసక్తి

జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆహార భద్రత(రేషన్) లబ్ధి కుటుంబాలు దొడ్డు బియ్యంపై పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. పౌరసరఫరాల శాఖ అర్బన్ పరిధిలో సుమారు 12.56 లక్షల రేషన్ కార్డులుండగా, అందులో బుధవారం నాటికి కేవలం 20 వేల కుటుంబాలు మాత్రమే ఈ నెల కోటా డ్రా చేసినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ నెల 17న హైదరాబాద్, 23న రంగారెడ్డి జిల్లాలో, 20న మేడ్చల్‌మల్కాజిగిరి అర్బన్ పరిధిలో నెల వారి కోటా గడువు ముగియనుంది.

పైలెట్‌పై గంపెడాశలు!

- మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి, గడ్డమల్లయ్య గూడ గ్రామాల్లో కూరగాయల సాగు
- ఎంపిక చేసిన రైతు కమిషన్
- రాయితీపై పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందించేందుకు కసరత్తు

యాచారం: కూరగాయలు సాగు చేసే అన్నదాతలు పైలెట్ ప్రాజెక్టుపైనే గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరింత ముందుకెళ్తామని చెబుతున్నారు. మహానగరానికి కూతవేటు దూరంలో ఉన్న యాచారం మండలంలోని మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి గ్రామాలు కూరగాయలు, ఆకుకూరల సాగుకు ప్రసిద్ధి. మూడింటిలో దాదాపు 1200 మందికి పైగా రైతులు కూరగాయలు, ఆకుకూరల సాగుపైనే ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. బోరుబావుల్లో ఉన్న కొద్దిపాటి భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకుంటూ టమాట, బెండ, చిక్కుడు, కాకర, వంకాయ, సొర, పుదీన, కొత్తిమీర, మెంతి, పుంటికూర తదితరాలను పండిస్తున్నారు. నిత్యం వాటిని ప్రైవేట్ వాహనాల్లో నగరంలోని మాదన్నపేట, సరూర్‌నగర్, ఎల్బీనగర్ మార్కెట్లకు తరలించి విక్రయిస్తారు.


చౌదర్‌పల్లిలో సాగవుతున్న బీర

కమిషన్‌తో మళ్లీ ఆశలు

రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా ముదిరెడ్డి కోదండరెడ్డి నియమితులైనప్పటి నుంచి స్థానిక రైతుల్లో ఆశలు చిగురించాయి. మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఇందులో భాగంగా కూరగాయలు, ఆకుకూరల సాగును ప్రోత్సహించనున్నారు. రైతు కమిషన్ ద్వారా ఆ మూడు గ్రామాల్లోని రైతులకు నాబార్డు భాగస్వామ్యంతో కావాల్సిన సౌకర్యాలు కల్పించడానికి నిర్ణయించారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖల ఆధ్వర్యంలోని అధికారుల బృందం అక్కడ ఏఏ సౌకర్యాలు కల్పిస్తే సాగుశాతం పెరుగుతుందో గుర్తించారు. మొదటి విడతగా 250 మంది అన్నదాతల నుంచి వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, డ్రిప్పు, స్ప్రింక్లర్లు, పైపులైన్లు, నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు, నెట్ షెడ్లు, తేనె, పట్టుపరిశ్రమకు అందించేందుకు దరఖాస్తులు స్వీకరించారు. వీటి పంపిణీపై కమిషన్ శ్రద్ధ వహించనుంది. దీంతో స్థానిక కర్షకులు సంబర పడుతున్నారు.


పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

చార్జీలు రావు



గ్రామంలోని 300 మందికి పైగా రైతులం పొలాల్లో పలు రకాల కూరగాయలను పండిస్తాం. దగ్గరలో మార్కెట్ సౌకర్యం లేక 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాదన్నపేట, సరూర్‌నగర్ రైతుబజార్లకు తరలించి విక్రయిస్తాం. ధరలు లేనప్పుడు ప్రయాణ చార్జీలు కూడా మిగలడం లేదు. మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

– నర్సింహ, రైతు, చౌదర్‌పల్లి

వైఎస్సార్ హయాంలో బాగు



దివంగత నేత వైఎస్సార్ హయాంలో రాయితీపై యంత్రాలు, పరికరాలు, విత్తనాలు అందించే వారు. ఉద్యాన శాఖ అధికారులు మండల కేంద్రంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి రాయితీపై నాణ్యమైన విత్తనాలు అమ్మేవారు. కానీ పదేళ్లుగా ఆ జాడే లేదు. ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేసి నష్టపోతున్నాం.

– బుచ్చిరెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

నివేదిక ఇవ్వమన్నారు



వ్యవసాయ, రైతు కమిషన్ మూడు గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరల పంటల ఉత్పత్తి పెంచేందుకుగాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. సాగుకు ఆసక్తి కలిగిన వారి నుంచి వివరాల సేకరించి, నివేదిక ఇవ్వమన్నారు. నాబార్డు, రైతు కమిషన్ ద్వారా ఆర్థిక ప్రోత్సాహం అందించనున్నట్లు సమాచారం.

– రవినాథ్, ఏఓ, యాచారం

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Last Chance 10th. Inter Direct Degree (Dist), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma MA, M.Com, M.Sc, MBA MCA Regular/ Lateral Entry Ph: 9490577501 [H-783371]

DISTANCE EDUCATION
■ Direct Final Year BA, BCom, BSC, MA, MSc, M.Com, B.Lic, M.Lic, Btech, MBA, LLB, GNM, BAMS, D Pharmacy. BPharmacy, cont : Asin acadamy, NZB. Cell:94400 27497. [SCA25002565]

Real Estate

BUILDING CONSTRUCTION
■ LV Constructions Well Sinking Contracts Prop:V.lingaiah H.No:2-23-26/32, Road No. 4, Mallikarjun Nagar Colony, Chilkanagar, Uppal, Hyderabad - 500039 (TS) Ph: 9440549109, 9849931950, 9700000366. We are well sinking contract having 30 years experience on having Excellent track record, all India i will do the work. [HA-34199]

PLOT FOR SALE
■ *గజం 2499/– రూ.కే విజయవాడ హైవే *నార్కట్ పల్లి దగ్గర అద్భుతమైన ఫామ్‌ల్యాండ్ వెంచర్‌లో 1210 గజాల ప్లాట్లు కలవు. సంప్ర: 6300892319 [HA-1303]

Services

BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800528]

BUSINESS OFFER
■ శ్రీ గోల్డ్ బైయర్స్ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9010190666 [SCA25002404]

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, Christina Vaz W/o, Frankie Vaz R/o Plot No. 37, Vaishnaoi Enclave, Petbasheerabad, Kompally 500067 have changed my name to Christina Dsouza Vaz for all purposes [DA-42200]
■ I, Jagillapuram Rajani R/o: 6-3-243/6, Premnagar, Chintal basthi, Khairthabad, Hyderabad, TG, after marraiage My Name As changed Kujala Rajani W/o Late Kujala Raj Mahendar [SCA25002567]

OLD AGE HOME
■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానసున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783370]

Wanted

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [SCA25002557]
■ ఇంటి పనులు చేయుటకు భార్యాభర్తలు కావలెను. రూము జీతం: 26 వేలు మరియు ఒంటరి మహిళా 15వేలు ఉదయం 8 నుండి 6వరకు. 8096628544, 8096628999 [HA-6320]
■ Wanted Female Office Incharge, with Computer Knowledge Good Communication Skill, Exp in Colling Ramanthapur, Hyd. 9492138833 [SCA-25002558]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-2491, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453